స్థాపితం : 1930 LONGEST LIVING NEWS PAPER IN TELUGU JOURNALISM

Visit Internet Edition @ www.jaminryot.com

స్థాపకుడు : నెల్లూరు వెంకట్రామానాయుడు

జీవప్రదాత : నెల్లూరు శ్రీరామమూర్తి

# జమీన్ రైతు

సంపుటి : 77 సంచిక :49 8.12.2006 శుక్రవారం 12పేజీలు విడిప్రతి: రూ.3.00

డి.ఆర్.ఉత్తమలో విందుల పసందు

* బర్త్‌డే పార్టీలు, ఎంగేజ్‌మెంటు ఫంక్షన్లు, వివాహాలు తదితర శుభకార్యాలకు, కార్పొరేట్ మీటింగులు, సెమినార్లు, గెట్‌టుగెదర్లు మరియు కాన్ఫరెన్స్‌లకు అత్యాధునిక వసతులతో , అన్ని హంగులతో బేంక్వెట్ హాల్స్ (అన్ని రకముల ఎలక్ట్రానిక్ - సౌండ్, మ్యూజిక్, వీడియో పరికరములతో సహా)
* ప్రతి రోజూ వివిధ రకాల వెజ్&నాన్‌వెజ్ స్పెషల్ బఫే లంచ్ రూ.160/-లే

మరిన్ని వసతులతో మీకు స్వాగతం పలికే

మీ డి.ఆర్.ఉత్తమ ☆☆☆ హోటల్

D.R. UTTHAMA HOTEL

23/976, Dhandayudha Puram, Nellore - 3. Phones : 2317777 - 10 Lines

# బలం పెరిగినా బలహీనతే!

ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిని చిత్రమైన రాజకీయ స్థితికి చేరవేశాయి ఉప ఎన్నికలు. బొబ్బిలి నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా గతంలో కంటే తన బలం పెంచుకున్నారాయన. గతంలో తెలుగుదేశం స్థానం ఇది. దానిని వశం చేసుకోవడం అంటే అర్థం అదే కదా? కరీంనగర్ ఓడిపోయినందు వల్ల ఆయనకొచ్చిన నష్టం అంటూ ఏమీ లేదు. అది కాంగ్రెస్ స్థానం కాదు. అక్కడి ఎన్నికలలో ప్రభుత్వ పనితీరు ప్రస్తావనకు రాలేదు. ప్రజలలో వున్న తెలంగాణా ఆకాం



క్షను మాత్రమే ప్రతిబింబించింది. తనది కాని స్థానాన్ని గెలుచుకున్నందుకు సంతోషిస్తూ కేరింతలు కొట్టవలసిన ముఖ్యమంత్రి ముఖం ఫలితాలు రాగానే వాడిపోయి కన్పించింది. ఆయన శిబిరంలోను ఆనంద ఛాయలు లేవు. మొత్తం మీద కాంగ్రెస్ పరిస్థితి చూస్తే విచార వదనాలే దర్శనమిస్తున్నాయి. ఎందువల్ల ఈ పరిస్థితి?

ఉప ఎన్నికల వల్ల రేపటి నుంచి రాష్ట్ర రాజకీయాలలో జరిగే పరిణామాలు ఊహించ కల్గిన వారికెవరికైనా ఈ ప్రశ్నకు సమాధానం తెలుసుకోవడం పెద్ద కష్టం కాదు. ఒక కోణం నుంచి చూస్తే, ఈ ఫలితాల వల్ల రాజశేఖరరెడ్డి మరింత ఆత్మ విశ్వాసంతో రానున్న రెండేళ్లు తన పోకడలో పరిపాలన కొనసాగించవచ్చు. సాంప్రదాయకంగా కాంగ్రెస్ వ్యతిరేక ఓటు బ్యాంకు కల్గిన ఉత్తరాంధ్రలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా ప్రజలు తన అభివృద్ధి కార్యక్రమాలను నచ్చుతున్నారని గర్వంగా చెప్పుకునే అవకాశం కల్గింది. అధిష్టానం వద్ద కూడా సంజాయిషీ చెప్పుకోవలసిన పరిస్థితి తలెత్తలేదు. తాను చేస్తున్న అభివృద్ధి ప్రక్కన పెట్టి, తన ప్రభుత్వ అవినీతిని ప్రజల మెదళ్లలోకి చొప్పించడానికి ప్రతిపక్షాలు, పత్రికలు చేసిన ప్రయత్నాలను జనం తిరస్కరించారని గొప్పగా చెప్పుకోవచ్చు. కరీంనగర్‌లో రెండవ స్థానం దక్కడం కూడా రాజశేఖరరెడ్డి అదృష్టం క్రిందనే లెక్క

అయితే రెండవ కోణం నుంచి చూస్తే, భవిష్యత్తు చీకాకులమయం కాక తప్పదన్పిస్తున్నది. కరీంనగర్‌లో ఓటమి తప్పదని తేలిన తర్వాత, బొబ్బిలిని దక్కించుకోవడానికి అన్ని విద్యలూ ప్రయోగించారు కాంగ్రెస్‌వాదులు. నియోజక వర్గం మొత్తం మీద ఓటుకు రెండు వందల నుంచి ఐదు వందల రూపాయల వరకు పంపిణీ చేశారు. అన్ని లక్షల మంది మహిళలకూ చీరలు పంచి పెట్టారు. ఒకరికి ఏడుగురు మంత్రులు, ముప్పయి మంది వరకు ఎమ్మెల్యేలను మోహరించి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేశారు. బొత్సా ఝాన్సీ ఎన్నికల ఖర్చు పాతిక కోట్లు దాటిందని అంచనా. ఎవరు ఎంత డబ్బు అడిగితే అంతా పంపించాడు ముఖ్యమంత్రి. ఇంత చేసినా, చావు తప్పి కన్ను లొట్టబోయినట్లు కేవలం 157 ఓట్ల తేడాతో గట్టెక్కగలిగింది కాంగ్రెస్ పార్టీ. రేపటి సాధారణ ఎన్నికలలో ఇంత డబ్బు క్రుమ్మరించడం, ఇంత రాజకీయ బలగాలను మోహరించడం అసాధ్యం. ఉన్న వనరులు అందరికీ పంచాలి కాబట్టి, ప్రచార ఖర్చు పల్చన అయి తీరుతుంది. అది పల్చన పడడం అంటే, ఫలితం కూడా బోల్తా పడడం అన్నమాటే.

గత రెండున్నరేళ్లుగా రాజశేఖరరెడ్డి ఎన్నో పథకాలు అమలు చేశాడు. లక్షల కోట్లతో జలయజ్ఞం చేపట్టి, ప్రతి ఊరికీ ఏదో ఒకరకంగా ఏదో ఒక ప్రాజెక్టు క్రింద నీళ్లు అందేటట్లు చూస్తున్నాడు. రేషన్ కార్డులు కరపత్రాల వలె పంచి పెట్టాడు. పింఛన్ల సొమ్ము మూడింతలు చేసి, గ్రామాలలో ఎందరు అర్హులైతే అందరికీ ఇస్తున్నారు. పావలా వడ్డీకి ఋణాలిస్తున్నారు. ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నారు. కరెంట్ పాత బాకీలన్నీ రద్దు చేశాడు. అన్నిటికంటే ముఖ్యంగా లక్షలాది ఇళ్లు కట్టించి ఇస్తున్నాడు. ఏ గ్రామంలో కూడా పేదవాడు తనకు పక్కా ఇల్లు లేదు అనే దిగులుతో బ్రతక కూడదు అనే లక్ష్యంతో నడుస్తున్నాడు. ఒక ముఖ్యమంత్రి లేదా ఒక ప్రభుత్వం ఇంత స్వల్ప కాలంలో ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, అమలు చేయడం అనేది చరిత్రలో ఎప్పుడూ జరగలేదు. ఈ అభివృద్ధి ఫలాలు అనుభవిస్తున్న ప్రజలు అందుకు ప్రత్యుపకారంగా చేయగలిగింది ఓటు వేయడం మాత్రమే. కానీ జనంలో ఆ ఋణానుబంధం కన్పించక పోవడం ఏ ముఖ్యమంత్రినైనా నిరుత్సాహ పరచి తీరుతుంది. ఇంక ఏమి చేస్తే, జనం మెచ్చుకొంటారు, ఓటు వేస్తారు అన్నది ఎవరికీ అర్థం కాని ప్రశ్న.

మరొక ప్రక్క కాంగ్రెస్‌లో అంతర్గ

తరువాయి 7వ పేజీలో

## చుట్ట కాలుస్తున్న పొన్నాల, జగన్?

కొంప తగలబడి పోతున్నదంటే, చుట్ట కాల్చుకోవడానికి నిప్పు దొరికిందని సంబరపడే ప్రబుద్ధులు సమాజంలో ఎప్పుడూ వుంటారు. పోలింగ్ నాడే, కరీంనగర్ ఉప ఎన్నికలో టిఆర్ఎస్ ఘన విజయం ఖాయం అని తేలిపోవడంతో, గుంటూరు ప్రాంతంలో భూముల కొనుగోలు ప్రారంభించారు కాంగ్రెస్ రాజకీయవాదులు. మేజర్ ఇరిగేషన్ మంత్రి పొన్నాల లక్ష్మయ్య మేనల్లుడు ఇప్పుడు గుంటూరులో మకాం పెట్టి వున్నాడు. ప్రత్యేక తెలంగాణా ఇవ్వక తప్పని పరిస్థితులు ఏర్పడబోతున్నాయని, కాబట్టి, కొత్త రాజధాని ఏర్పడే ప్రాంతంలో ఇప్పటికిప్పుడే భూములు కొనమని తనకు తన మామ సలహా ఇచ్చాడని చెప్పున్నాడాయన. గతంలో ఇదే మోస్తరు వదంతులతో అప్పులు చేసి మరీ కోట్లు క్రుమ్మరించి భూములు కొని దివాలా తీసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులను పిలిపించి మాట్లాడుతున్నాడు. మరొక ప్రక్క ముఖ్యమంత్రి కుమారుడు జగన్ మనుషులమని చెప్పుకునే వారు కొందరు కూడా విజయవాడ, గుంటూర్లకు చేరుకున్నారు. వారి దృష్టి కూడా ఆర్థిక ఇబ్బందులలో వున్న రియల్ ఎస్టేట్ వ్యాపారుల మీద కేంద్రీకరిస్తున్నారట.



